క్లుప్తంగా

ఆర్ఐగా బాధ్యతల స్వీకరణ



నారాయణపేట రూరల్: జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్‌గా నర్సింహ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.శ్రీకాంత్ హైదరాబాద్‌లోని టీఎస్‌పీఏ ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ అయ్యారు. ఆర్ఐ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ యోగేష్‌గౌతమ్‌ను కలిసి పూలమొక్క అందించారు.

తాగునీటి సమస్యపై వినతి



మద్దూరు: ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని, ఎలాంటి లోపాలున్న వెంటనే సరి చేయాలని పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు సోమవారం తహసీల్దార్ మహేష్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో గ్రామాల్లో ఉన్న బోర్లను మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, ఆంజనేయులు, కాశీనాథ్, లాలు, అశోక్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన పనులు పున:ప్రారంభం



దామరగిద్ద: మండల కేంద్రంలోని జీపీఎస్ నూతన భవన పనుల ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. కొన్ని నెలలుగా నిధుల లేమితో కాంట్రాక్టర్ పనులు నిలిపివేయగా కలెక్టర్ ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో పెండింగ్ పనులను సోమవారం తిరిగి ప్రారంభించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా శిథిలావస్థల్లో ఉన్న పాఠశాల భవనం కూల్చి అదే స్థానంలో రూ.54 లక్షలతో భవన నిర్మాణం చేపడుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మక్తల్: గుర్లపల్లి వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. గుర్లపల్లికి చెందిన ట్రాక్టర్ శ్రీకాంత్‌గౌడ్, డ్రైవర్ మొగులప్ప కేసు నమోదు చేశామని, ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డిలో గల కృష్ణానది నుంచి నిత్యం రాత్రి వేళలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ఆ గ్రామ ప్రజలు సోమవారం విలేకరులకు తెలియచేశారు. గ్రామంలోని కొందరు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఇతర గ్రామాలకు తరలిస్తున్నారని ఈ విషయంపై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామంలోని ఇల్లు కట్టుకునే వారికి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల నుంచి రూ.6వేలకు అమ్ముతున్నారన్నారు. ప్రభుత్వం ఇళ్ల కట్టుకునే వారికి ఉచితంగా అనుమతులు ఇవ్వాలని కోరారు.

మురుగుగుంతను పూడ్చండి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 22వ వార్డు పరిధిలోని మధురానగర్‌కు వెళ్లే దారిలో కుడివైపు ఉన్న పెద్ద మురుగుగుంతను పూడ్చి వేయాలని స్థానికులు సోమవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను చాంబర్‌లో కలిసి విన్నవించారు. అందులో మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఆ మురుగును మెయిన్ రోడ్డు లోని కాజ్‌వే ద్వారా కిందికి వెళ్లేలా చూడాలని కోరారు. అనంతరం వారితో పాటు ఆయన అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. మురుగు నిల్వ కాకుండా వెంటనే జేసీబీతో కాజ్‌వే ద్వారా కిందికి మళ్లిస్తామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వెంట డ్రెయిన్ నిర్మించి పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.



పదో తరగతి పరీక్షలు ప్రారంభం



మక్తల్‌లో బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు



మాగనూరులో తనిఖీ చేస్తున్న సిబ్బంది



మద్దూరులో బయటకు వస్తున్న విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. మాగనూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో గంట ముందే విద్యార్థులు చేరుకున్నారు. మొత్తం 222 మంది పరీక్ష రాయాల్సి ఉండగా అందరూ కూడా పరీక్షకు హాజరు అయ్యారు.

■ మద్దూరు జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ మీడియంలో 186 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 219 మంది, కృష్ణవేణి పాఠశాలలో 203 మంది, గీతాంజలి పాఠశాలలో 220 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. తొలి రోజు పరీక్షకు ఎవరూ గైర్హాజరు కాలేదని ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు.

■ కృష్ణా మండలంలోని కున్సి, గుడెబల్లూర్, ముడుమాల్, కస్తూర్బా పాఠశాలలకు చెందిన మొత్తం 300 మంది విద్యార్థులు ఉండగా అందులో 299 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

■ నర్వ మండలంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో 209, కస్తూర్బా గురుకుల పాఠశాలలో 170 మంది, జెడ్పీహెచ్‌ఎస్ పెద్దకడ్మూర్ కేంద్రంలో 127 మందికి గాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 506 మంది విద్యార్థులకు 504 మంది హాజరయ్యారు.

■ మరికల్ మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్ పాల్పకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులకు యువక మండలి ఆధ్వర్యంలో మజ్జిగా పంపిణీ చేశారు.

■ ఊట్కూరు మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు నాలుగు కేంద్రాలలో ప్రారంభమయ్యాయి. బాలికల ఉన్నత పాఠశాలలో 121 మంది విద్యార్థులకు 120 మంది, బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో 112 మంది విద్యార్థులు, పులిమామిడి ఉన్నత పాఠశాల కేంద్రంలో 160 మంది విద్యార్థులు, కేజీబీవీ పులిమామిడిలో 98 మంది విద్యార్థులు హాజరయ్యారు.

■ మక్తల్‌లో బాలుర జెడ్పీహెచ్‌ఎస్‌లో 240, బాలికల పాఠశాలలో 239 మంది హాజరు కాగా, ఒకరు హాజరుకాలేదు. బ్రిలియంట్‌లో 188, ఒకరు హాజరుకాలేదు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200, అక్షర ఉన్నత పాఠశాలలో 193గాను 189 మంది, కేరళ పాఠశాలలో 219 మంది హాజరయ్యారు. మొత్తం 1,275 మంది పరీక్షలకు హాజరుకాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు.

■ దామరగిద్ద పరీక్ష కేంద్రంలో 241 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరయ్యారు. కాన్‌కుర్తి పరీక్ష కేంద్రంలో 196 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.



కృష్ణా ఉన్నత పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు



ఊట్కూరు బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



మరికల్‌లో విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న యువక మండలి సభ్యులు

ఎంపీఓపై దాడి అమానుషం



నిరసన తెలుపుతున్న ఎంపీఓ, సిబ్బంది

మాగనూర్: ఎంపీఓపై దాడి చేయడం అమానుషమని స్థానిక ఎంపీఓ జైపాల్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల ఎంపీఓపై దాడికి నిరసనగా స్థానిక మండల ప్రజా పరిషత్ ఎదుట సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వంలో అన్ని శాఖల కంటే అత్యధికంగా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రజల ముగింట్లోకి తీసుకువెళ్లి గ్రామాలను అభివృద్ధి దిశలో నడిపిస్తున్న శాఖ పంచాయతీరాజ్ అని అన్నారు. అలాంటి పంచాయతీరాజ్‌శాఖలో ముఖ్యమైన మండల పంచాయతీ అధికారిపై ఎంపీపీ కొట్టడం అమానుషమని అన్నారు. పంచాయతీరాజ్ శాఖలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు అందరూ కలిసికట్టుగా గ్రామాల, మండలాల, రాష్ట్రాలను అభివృద్ధికి తన వంతు బాధ్యతలను చేపడుతున్నారన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని దాడి చేసిన ఎంపీపీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పక తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

మాగనూర్: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి విరోజ అన్నారు. మండల కేంద్రంలోని రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో పోషక విలువలు ఉండే ఆకుకూరలు, పండ్లు తదితర వాటిని ప్రదర్శించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆకుకూరాలు, పాలు ఎక్కువగా తీసుకోవాలని వాటి వలన రక్తహీనత లేకుండా సుఖప్రసవం జరుగుతుందని తెలిపారు. బరువు తక్కువ పిల్లలు పుట్టడం వలన వారికి ఎలాంటి అనారోగ్యం వచ్చినా తొందరగా కోలుకోలేరని పూర్తిగా అనారోగ్యానికి గురవుతారని తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ, టీచర్లు తులసి, జగదీశ్వరి, అశ్విని, మానస, సరిత తదితరులు పాల్గొన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు



వృథాగా పోతున్న తాగునీరు

● పగిలిన పైపులైన్

మాగనూర్: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఎన్‌హెచ్–167 పక్కన మిషన్ భగీరథ పైపులైన్ పగిలి మూడు రోజులుగా చెరువులోకి నీరు వృథాగా పోతుంది. పైపులైన్ పగిలి పోవడంతో సుమారుగా ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాల్లోని 40 గ్రామాలకు పైగా తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఒక్కవైపు వేసవి కాలం మొదలుకావడంతో గ్రామాలలోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే అధికారులు మాత్రం తమకు ఏమి పట్టనట్లు వ్యవహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మిషన్ భగీరథ అధికారులు స్పందించి పగిలిన పైపులైను మరమ్మతు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఓటరు చైతన్యంపై మానవహారం



మానవహారంలో పాల్గొన్న అధ్యాపకులు, అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఓటరు చైతన్యంపై మానవహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు కార్యక్రమంలో డీఐఈఓ శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు ఓటరుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన పెంచుతామని, 18 సంవత్సరాలు దాటిన యువత ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భగవంతాచారీ, ఉమామహేశ్వర్, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ధన్వాడ: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎనికైన మండల కేంద్రానికి చెందిన సుంకు ఉమేష్‌కుమార్‌ను గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం తనవంతు సహకారం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాశయ్య, సాయిబాబా, రాము, గోపి, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కృష్ణా: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో మహిళా కూలీలు వంద రోజులు పూర్తి చేసుకున్న వారికి కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీ తదితర అంశాలపై నెల రోజులు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఉమ్మడి జిల్లా డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో 35 మంది మహిళలు ఉంటే కృష్ణా మండల కేంద్రంలోని రైతు వేదికలోనే శిక్షణను అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం 38 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో అర్హులను గుర్తించి ఎంపిక చేస్తామన్నారు. ఎంపీడీఓ జానయ్య, ఎస్‌బీఐ అధికారి ఆర్ శెట్టి, ఏపీఎం బస్వరాజ్, సీసీ అరుణ్, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

మక్తల్: పట్టణంలో సోమవారం బీసీ కాలనీలోని తాత్కాలిక భవనంలో పాఠశాలను ప్రారంభించిన అనంతరం సోమవారం మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్ విద్యార్థులు ప్లేట్లు, స్టీల్ సామగ్రి అందజేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్లేట్లు లేకపోవడంతో అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మన్, రహింపటేల్, వాకిటి శ్యాం పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



అమరచింత: ప్రస్తుత తరుణంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ కొందరు అమాయకుల నుంచి రూ.లక్షలు దోచుకుంటున్నారని, అలాంటి సైబర్ నేరగాల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సైబర్ నేరాలపై యువకులకు అవగాహన కల్పించారు. ఉచితంగా ఎవరూ డబ్బులు ఇవ్వరని, అలాంటిది సెల్‌ఫోన్లలో మీకు పరిచయం లేని వ్యక్తులు బహుమతులు వచ్చాయని, నగదును గెలుచుకున్నారని తప్పుడు సమాచారం అందిస్తూ మీ వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలను హ్యాకింగ్ చేస్తు డబ్బులు కొట్టేస్తున్నారని తెలిపారు. ఆధార్ అప్‌లోడ్ చేస్తామని, బ్యాంక్ నుంచి అని, ఏటీఎం పిన్ అప్‌డేట్, మొబైల్ నంబర్ తప్పుగా ఉందని ఇలా రకరకాలుగా మాట్లాడుతూ మోసం చేస్తుంటారని వివరించారు. ఇలాంటి వాటిని నమ్మొద్దని, ఫేక్ కాల్స్‌పై తమకు వెంటనే సమాచారం అదించాలని కోరారు.

జీవవైవిధ్య సంరక్షణ అందరి బాధ్యత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: భూమిపై జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో లైఫ్‌సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఒక్కరోజు జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్వంలో భూమి మీద మాత్రమే చెట్లు, మానవులు, జంతువులు నివసించేందుకు ఆస్కారం ఉందన్నారు.

ఘనంగా బండారు ఉత్సవం



బండారు చల్లుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూరు: బీరప్పస్వామి ఉత్సవాలు సోమవారం మండలంలోని నిడుగుర్తిలో కుర్వ కులస్తులు ఘనంగా ప్రారంభించారు. బీరప్పస్వామి ఆలయం వద్ద బండారు కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వందలాది భక్తులు హాజరయ్యారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బండారు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పశ్చిమాద్రి సంస్థాన మఠం జాతర



సటస్థల జ్వదరోహణ కార్యక్రమంలో స్వామీజీ

మాగనూర్: మండలంలోని నేరడగంలో పశ్చిమాద్రి సంస్థాన విరక్త మఠం జాతర సందర్భంగా సిద్ధలింగ మహాస్వాముల మఠం ఆవరణలో సటస్థల జ్వదరోహణ ఆవిష్కరించి మహోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధలింగ మహాస్వాములు మాట్లాడుతూ.. మఠంలో సోమవారం నుంచి 29 వరకు జరిగే మహోత్సవాల సందర్భంగా నిత్యం వివిధ భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోరారు. మఠం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చైర్మన్‌ల నియామకంలో మాలలకు అన్యాయం

దామరగిద్ద: కార్పొరేషన్ చైర్మన్‌ల నియామకంలో మాల ఉప కులాలకు అన్యాయం జరిగిందని జాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గ్యాంగ్ హన్మంతు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి మాత్రమే పదవులు ఇవ్వడం ఇందుకు నిదర్శనమన్నారు. మాలలపై చిన్న చూపు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

విద్యార్థుల పోరాటాల ఫలితమే కళాశాలలు



మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు రాము

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ విద్యార్థుల పోరాట ఫలితంగానే కొత్తగా లా, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుపై ప్రతిపాదలను ప్రభుత్వం కోరిందని పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము పేర్కొన్నారు. ఈమేరకు కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కోరిన ప్రతిపాదనలను వీలైనంత త్వరగా పీయూ అధికారులు పంపించాలని, అన్ని కోర్సులను రెగ్యులర్ పరిధిలోనికి తీసుకువచ్చి, రెగ్యులర్ అధ్యాపకులు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కళాశాల ఏర్పాటు కోసం కృషి చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి, వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్‌కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, గణేష్, జగదీష్, ఆంజనేయులు, లేపాక్షి, వంశీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీడీ కార్మికుల ‘చలో చిన్నచింతకుంట’



బీడీ కార్మికులకు కరపత్రాలను అందిస్తు ప్రచారం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

అమరచింత: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీడీ కార్మికులకు బీడీ కూలి పెంచాలని డిమాండ్ చేస్తు మంగళవారం చలో చిన్నచింతకుంట కార్యక్రమం నిర్వహిస్తున్నామని బీడీఅండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్ రమేష్, బుచ్చన్న తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం బీడీ కార్మికుల ఇళ్ల వద్దకు వెళ్లి బీడీ కూలి పెంపు కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించే కరపత్రాలను కార్మికులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీడీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్‌చేశారు. పీఎఫ్, గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. అమరచింతలో 4 వేల మంది బీడీ కార్మికులు ఉన్నారని వీరిలో కేవలం 4 వందల మందికి మాత్రమే జీవన భృతి అందుతున్నదన్నారు. ప్రతి బీడీ కార్మికుడికి జీవన భృతి అందించి ఆదుకోవాలని కోరారు. అజయ్, విజయ్ , ప్రకాశం, నిశాంత్, వెంకటన్న, అనంతమ్మ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం వెనక ప్రతిపక్షాల కుట్ర



జితేందర్‌రెడ్డి మాట్లాడిన వీడియో చూపిస్తున్న డీకే అరుణ

● బీజేపీలో జితేందర్‌రెడ్డికి సముచితస్థానం
● శ్రీనివాస్‌గౌడ్ బీజేపీలో చేరుతారనేది అవాస్తవం: డీకే అరుణ

పాలమూరు: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బీజేపీలో చేరుతారనేది కేవలం ఊహాగానాలు మాత్రమేనని, ఇది ప్రతిపక్ష పార్టీల కుట్ర పూరితంగా ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ఖండించారు. జిల్లాకేంద్రంలో పద్మావతికాలనీలోని ఆమె నివాసంలో సోమవారం మాట్లాడుతూ మొదటి నుంచి బీజేపీ ఏపీ జితేందర్‌రెడ్డికి కావాల్సిన గుర్తింపు ఇచ్చిందని, జాతీయస్థాయిలో అత్యున్నత పదవి, ఢిల్లీలో కోర్ కమిటీ సమావేశాల్లో అవకాశం ఇచ్చిందన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను పోటీ చేయాలని చాలా మంది అడిగినా.. జితేందర్‌రెడ్డి అడిగారని ఆయన కుమారుడికి మహబూబ్‌నగర్ టికెట్ ఇచ్చినట్లు తెలిపారు. ఎవరూ లేకపోతే మాకు టికెట్ ఇచ్చారని చెప్పడం సరికాదన్నారు. ఒక రోజు వ్యవధిలో ప్లేట్ ఫిరాయించి బీజేపీపై మాట్లాడిన తీరు ప్రజలు గుర్తించాలన్నారు. జితేందర్‌రెడ్డికి సంబంధించి ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని, దీనిపై వారే సమాధానం చెప్పాలన్నారు. మహబూబ్‌నగర్ బీజేపీలో పని చేసిన చాలా మంది సీనియర్ నాయకులు పార్టీ వదిలి వెళ్లిపోవడానికి ఆయనే కారణమన్నారు. పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో, మండల, పట్టణాల్లో ఈనెల 20నుంచి పార్టీలో చేరికలు భారీగా ఉంటాయన్నారు. నాగర్‌కర్నూల్‌లో ప్రధాని మోదీ సభను విజయవంతమైందని, భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజయ్య, రాజేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాచాల శ్రీధర్ పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివించాలి



అవగాహన కల్పిస్తున్న సీఏ సీసీలు

నర్వ: పోటీ ప్రపంచంలో మగవారితో సమానంగా ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీఏసీసీలు అనిత, రేణుక అన్నారు. సోమవారం మండల రైతుకేంద్రంలో మైనార్టీలకు బేటి బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఆడపిల్లల నిష్పత్తి మగ పిల్లలతో పోలిస్తే తక్కువగా ఉందన్నారు. ఆడపిల్లలకు ఉన్నత చదువులు చదివించేందుకే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. 14 ఏళ్లలోపు వారిని పనిలో పెట్టుకోకూడదని, 18 ఏళ్లలోపు పిల్లలను వివాహం చేయవద్దన్నారు. భార్యభర్తల గొడవలు పరిష్కరించడానికి సఖీ సెంటర్ 181, షీటీమ్స్ కోసం డయల్ 100, చైల్డ్‌లైన్ హెల్ప్ నెంబర్ కోసం 1098, ఓల్డేజీ హోమ్ కోసం 14567 గురించి అవగాహన కల్పించారు. పదేళ్ల పిల్లల పేరిట సుకన్య సమృద్ధి యోజన పథకంలో చేరాలని చేయాలని అది వారి ఉన్నత చదువులకు, వివాహానికి అందుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రషీదబేగం, షాహీన్‌బేగం, రజీయాబేగం, జరీనాబేగం, ఖలీల్‌అహ్మద్, రఫీక్, మహ్మద్, ఖాసీం, చాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.